క్లుప్తంగా

మండలంలో ప్రశాంతంగా పోలింగ్



గండ్రేడులో వీల్ చైర్‌పై ఓటు వేయడానికి పెద్ద సత్తిరాజును తీసుకొస్తున్న స్థానికులు

పెదపూడి: మండలంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలో మొత్తం 64 పోలింగ్ బూత్‌ల్లో సుమారు 48,240 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే వీడియో, సీసీ కెమెరాల నిఘాలో ఎన్నిక జరిగిందన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు పూర్తవ్వాల్సి ఉండగా రాత్రి పది గంటల వరకూ కొనసాగిందన్నారు.



కాటవరం ఎస్సీపేట వద్ద బూత్ నుంచి రోడ్డుపైకి వచ్చిన ఓటర్ల క్యూ



పందలపాకలో ఓటేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు



నరేంద్రపురంలో బారులు తీరిన ఓటర్లు



వెలుగుబందలో..



కలచవర్లలో (ఉదయం)..

ఓటెత్తిన జనం



రాజానగరంలో 90 ఏళ్లు పైబడిన వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి ఎత్తుకుని వస్తున్న బంధువు

- చీకటి పడేవరకూ పోలింగ్ కేంద్రాల్లో బారులు
- ఎండను సైతం లెక్కచేయక క్యూలో నిలబడ్డ ఓటర్లు
- ఈవీఎంల జాప్యంతో అసహనం
- అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలు నియోజకవర్గంలో అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు మినహా సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఆర్వో ఎ.చైత్రవర్షిణి పర్యవేక్షణలో, గట్టి పోలీసు బందోబస్తు నడుమ సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని 216 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11.45 గంటలకు 86.16 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,16,491 ఓటర్లలో 1,86,533 మంది ఓటు వేశారు. ఉదయం 7 గంటల నుంచి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా ఏమాత్రం లెక్కచేయకుండా, మహిళలు సైతం ఓటు వేసేందుకు క్యూలైన్లలో నిలబడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే ఒరవడి ప్రతిచోటా కనిపించింది. పోలింగ్ బూత్‌ల వద్ద జనం కిటకిటలాడుతూ ఉన్నా ఓటింగ్ ప్రక్రియ మాత్రం నెమ్మదిగా జరగడంతో, వచ్చిన జనం ఓటు వేసేందుకు గంటల తరబడి వేచిచూశారు.

పోలింగ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం

ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఎలక్ట్రానిక్ విధానంలో ఓటు వేయడం వల్ల, అందుకు సాంకేతిక ప్రక్రియలో తీవ్ర జాప్యం ఏర్పడింది. దీనికితోడు కొన్నిచోట్ల ఇరుకు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఒకేచోట రెండు, మూడు పీఎస్‌లుండటంతో ఓటర్లు అసౌకర్యానికి గురయ్యారు. ఓటు వేసేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఈ కారణంగా నిర్ణీత సమయం సాయంత్రం 6 గంటలు దాటినా అప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశమిచ్చారు. దీంతో కోరుకొండ మండలం, నర్సాపురం, శ్రీరంగపట్నం, గాదరాడ, నిడిగట్ల, దోసకాయలపల్లి, రాజానగరం మండలం కలచవర్ల, చక్రద్వారబంధం, వెలుగుబంద, పాలచర్ల, దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, జి.యర్రంపాలెం, తుంగపాడు, సీతానగరం మండలం, చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం, కూనవరం, సీతానగరం మున్నగు గ్రామాల్లో రాత్రి 9 గంటలు దాటే వరకు పోలింగ్ కొనసాగింది.

స్వల్ప సంఘటనలు

సీతానగరం, కొండేపూడి, చినకొండేపూడి, రాపాక, కలవచర్ల, నరేంద్రపురం, చక్రద్వారబంధం, శ్రీకృష్ణపట్నం, జి.యర్రంపాలెం తదితర పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సమయంలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల నడుమ కొద్దిపాటి వివాదాలు చోటుచేసుకుని, స్వల్ప ఘర్షణలకు దారితీశాయి. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో అమలు చేస్తున్న నిషేధాజ్ఞలను ఉల్లఘించారంటూ స్పెషల్ ఫోర్స్ కానిస్టేబుల్ రాజానగరం మండలం, కలచవర్లలో ఎస్సీ యువకులపై దురుసుగా ప్రవర్తించడం వివాదానికి దారితీసింది. చెట్ల నీడన కుర్చీలు వేసుకుని కూర్చున్న వారిలో ఒకరిపై కానిస్టేబుల్ చేయిచేసుకోవడంతో ఎస్సీలంతా ఏకమై పోలింగ్‌ని జరగనివ్వబోమంటూ పోలింగ్ బూత్‌లోకి దూసుకుపోయారు. ఇంతలో స్థానిక నాయకులు వారిని సముదాయించి, బయటకు తెచ్చారు. పోలింగ్‌కు కొంత అంతరాయం కలిగింది.

జనసేన అభ్యర్థి ప్రచారం

పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో ఎటువంటి ఎన్నికల ప్రచారాలు చేయరాదని ఎన్నికల సంఘం విధించిన నిబంధనలను జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఉల్లంఘించారు. సీతానగరం మండలంలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన ఆయన శ్రీరంగపట్నంలో పోలింగ్ బూత్‌లోకి అనుచరులతో కలిసి వెళ్లారు. బూరుగుపూడిలో క్యూలో నిలుచున్న ఓటర్లను కలుసుకుని, చేతులు జోడించి గ్లాస్ గుర్తుకు ఓటు చేయాలని ప్రచారం చేయడం విమర్శలకు తావిచ్చింది. ఆ సమయంలో ప్రత్యర్థి పార్టీకి చెందిన వారెవ్వరూ అక్కడ లేకపోవడంతో అధికారులెవ్వరూ అభ్యంతరం చెప్పే ప్రయత్నం చేయలేదు. అలాగే ఆయన భార్య బత్తుల వెంకటలక్ష్మి రాపాక పోలింగ్ బూత్ లోకి అనుయాయులతో వెళ్లడాన్ని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో ఆమె ఘర్షణకు దిగి, అలజడి సృష్టించేందుకు యత్నించారు. గొడవను అడ్డుకునే సమయంలో అవతలి వ్యక్తి చేయి తగలడంతో తనపై చేయిచేసుకున్నారంటూ ఆమె గొడవపడ్డారు.

సూర్యారావుపేటలో ఓటేసిన జక్కంపూడి రాజా



ఓటు వేసి బయటకు వస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మండలంలోని సూర్యారావుపేటలోని 194 నంబరు పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన సతీమణి డాక్టర్ రాజశ్రీ, తల్లి జక్కంపూడి విజయలక్ష్మి కూడా ఇదే బూత్‌లో ఓటు వేశారు.



ఎండ తీవ్రతకు గొడుగుతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన మహిళ



కలవచర్లలో పోలింగ్‌కి సమీపంలో ఉన్న చెట్టు నీడన కూర్చున్న ఎస్సీ యువకులతో గొడవ పడుతున్న స్పెషల్ ఫోర్సు సిబ్బంది

బారులు తీరిన ఓటర్లు



చినకొండేపూడి హైస్కూల్లో బారులు తీరిన ఓటర్లు



రఘుదేవపురంలోని పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులుతీరారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండు గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పలు గ్రామాల్లో చెదురుమదురు ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసుల పటిష్ట భద్రతా ఏర్పాట్లతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. పలు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో వంగలపూడి జెడ్పీ హైస్కూల్, చినకొండేపూడి ఆదర్శ పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ఉదయం 8.30కు ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. మిట్టమధ్యాహ్నం ఒంటి గంటకు ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం 6 గంటలైనా ఓటర్లు క్యూలైన్లలో ఉండటంతో చినకొండేపూడి, రఘుదేవపురం, సీతానగరం, కూనవరం, బొబ్బిల్లంక, కాటవరం తదితర గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల్లో స్వల్ప ఘర్షణల మధ్య పోలింగ్ జరిగింది. సీతానగరం, చినకొండేపూడి, రాపాక, కాటవరం తదితర గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎస్సై టి.రామకృష్ణ ఆయా ప్రాంతాలకు చేరుకుని ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా కొనసాగడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కాగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు.

నన్నయ స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు

రాజానగరంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఎన్నికల అధికారులు ఈవీఎంలను తరలించారు. ఇక్కడ కేటాయించిన నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం యూనిట్లను బస్సుల్లో సోమవారం రాత్రి తరలించారు. ప్రత్యేక గదుల్లో వాటిని భద్రపరిచారు.





ఎన్నికల నిబంధనలకు పాతర

బూత్ వద్దే జనసేన అభ్యర్థి ప్రచారం



బూరుగుపూడిలోని పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను అభ్యర్థిస్తున్న జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

మధురపూడి: ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఓటర్లను ఓటు వేయమని అభ్యర్థించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కోరుకొండ మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నిడిగట్ల, కోటి, నర్సాపురం, గాదరాడ, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు. ఉదయం పోలింగ్‌కు తక్కువగా వెళ్లిన ఓటర్లు, మధ్యాహ్నానికి పోటెత్తారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. కోరుకొండ మండలంలో 65,439 మంది ఓటర్లలో సాయంత్రం 6 గంటలకు 70 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ బూత్‌ల వద్ద అభ్యర్థులు ప్రచారం చేయరాదు. ఇందుకు విరుద్ధంగా బూరుగుపూడిలోని పోలింగ్ కేంద్రంలో బత్తుల బలరామకృష్ణ క్యూలో ఉన్న ఓటర్లను ఓటు వేయమని అభ్యర్థించారు. పోలింగ్ సమయం పూర్తయ్యాక సాయంత్రం 6 గంటలకు శ్రీరంగపట్నం బూత్‌లోకి నలుగురు వ్యక్తులను తీసుకువెళ్లారు.

వీల్‌చైర్స్‌లో వచ్చిన వృద్ధులు

కోరుకొండ మండలంలో పలు పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. జంబూపట్నంలో ఉల్లి సుబ్బారావు వీల్ చైర్‌పై వెళ్లారు. కోరుకొండ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో వయో వృద్ధులైన తడికొండ చంద్రరావు, ఆయన భార్య ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జంబూపట్నంలో పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధుడు ఉల్లి సుబ్బారావు

ఓట్ల పండగకు పోటెత్తారు



అనపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, కొడుకు డాక్టర్ గౌతమ్‌రెడ్డి, కోడలు ప్రియాంక

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్
- అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్న యువత, మహిళలు
- నియోజకవర్గంలో 81 శాతానికి పైగా పోలింగ్

అనపర్తి/పెదపూడి/రంగంపేట/బిక్కవోలు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల సమరం పలుచోట్ల చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో పీఓలు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం మాక్ పోలింగ్ వివరాలను రికార్డుల్లో నమోదు చేశారు. మాక్ పోలింగ్ సమయంలోనే అనపర్తి మండలం కొప్పవరం 25వ పోలింగ్ బూత్‌లో పోలింగ్ యంత్రాలు మొరాయించాయి. దీంతో కొప్పవరంలో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ సుమారు గంట ఆలస్యంగా ప్రారంభమైంది. వేసవి నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గంటల తరబడి వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 1 గంట వరకూ మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం 3 గంటల తరువాత ఊపందుకుని సాయంత్రానికి 81 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు అధికారులు కూపన్లు అందించి వారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించారు

తరలి వచ్చిన యువ ఓటర్లు

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో నియోజకవర్గ పరిధిలో ముఖ్యంగా యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఓటు వేశారు. వివిధ వ్యాపారాల నిమిత్తం గ్రామాంతరాల్లో నివాసముంటున్న వారు సైతం సొంత ఊరికి చేరుకుని పెద్ద ఎత్తున పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలింగ్ సమయంలో దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో పురుషుల కంటె అత్యధికంగా మహిళలు, నూతనంగా ఓటు హక్కు పొందిన యువత తమ ఓటు వినియోగించుకునేందుకు ఆసక్తి కనబరిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అనపర్తిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు రామవరంలో ఓటు వేశారు.

పోలింగ్ వేళ ఇదీ పరిస్థితి

- అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం, కుతుకులూరు, పులుగుర్త గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వాగ్వాదాలు, చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.
- రంగంపేట మండలం వడిశలేరు, వెంకటాపురం, ముకుందవరం గ్రామాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.
- అనపర్తి మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవటంతో ఎండ వేడిమికి ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఓటింగ్ యంత్రాలను జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం తరలించారు. ఈవీఎంలకు, వీవీ ప్యాట్‌లకు సీల్ వేసి వారికి కేటాయించిన బస్సుల్లో రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు తరలించి అక్కడ భద్రపరిచారు.
- బిక్కవోలు మండలం రంగాపురంలో గ్రామ సర్పంచ్ జి.వీరభద్రం తదితరులపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయి. దీంతో గాయపడినవారిని అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. వారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ కార్యకర్తల దాడి హేయమైన చర్య అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మూకలకు త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమైన నేపథ్యంలో వారు ఓర్వలేక ఈ దాడికి పాల్పడ్డారన్నారు.



టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన సర్పంచ్ వీరభద్రాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



పెదరాయవరంలో క్యూలో వేచి ఉన్న ఓటర్లు



రంగాపురంలో క్యూలో నిలుచున్న ఓటర్లు



అనపర్తి మండలం కుతుకులూరు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



రంగంపేటలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



జి.మామిడాడలో ఓటేయడానికి బారులు తీరిన ఓటర్లు